క్లుప్తంగా

7న ఆటో కార్మికుల హక్కుల మహాసభ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆటో డ్రైవర్లు

తాండూర్: ఆటో కార్మికుల హక్కుల మహాసభను ఈ నెల 7న గోదావరిఖనిలో నిర్వహిస్తున్నట్లు జేఏసీ ఫైమెన్ కమిటీ సభ్యుడు చాంద్‌పాషా, తాండూర్ మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎండీ హబీబ్ పాషా తెలిపారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాసభ కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. గోదావరిఖని ఎన్టీపీసీ ఆర్ ఆర్ గార్డెన్‌లో నిర్వహించే మహాసభకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ఆటో కార్మికుల సమస్యలపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఆటో కార్మికులు భారీ సంఖ్యలో తరలివచ్చి మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రేచినీ అడ్డా అధ్యక్షుడు రామకృష్ణ, అచ్చులాపూర్ అడ్డా ఉపాధ్యక్షుడు జాపతి సతీష్, తాండూర్ మండల ఆటో కార్మికులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న సీఐ

చెన్నూర్: భారత ఎన్నికల సంఘం కల్పించిన పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. చెన్నూర్ తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ సెంటర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు.. ఎన్నికల సంఘం అత్యవసర సేవలు, ఎన్నికల విధులు నిర్వర్తించే వారి కోసం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందన్నారు. విధుల రీత్యా సమయం లభించదనే ఉద్దేశంతో ముందుగానే పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నట్లు తెలిపారు.

ఊరు రామకృష్ణాపూర్‌లో గ్రామ దేవతల కొలుపు



మొక్కు తీర్చుకుంటున్న గ్రామ పెద్దలు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు రామకృష్ణాపూర్‌లో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శనివారం గ్రామ దేవత కొలుపు నిర్వహించారు. మదనపోచమ్మ, ఊరపోచమ్మకు బోనాలు సమర్పించారు. గ్రామ దేవతలైన భూలక్ష్మీ, మాలక్ష్మీ విగ్రహాలను పాతవి తొలిగించి కొత్తవి ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి తొమ్మిది గంటల తర్వాత నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకు కట్టడి ఉంటుందని, ఆ సమయంలో ఊరులోకి రాకపోకలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు



బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు

సాక్షి ఎఫెక్ట్..

మందమర్రిరూరల్: గత నెల 29న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'మూలమలుపు ప్రమాదకరం.!' అనే వార్తా కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. రామన్‌కాలనీ, ఏరియా స్టోర్స్ మూల మలుపుల వద్ద రెండు చోట్ల ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై స్పీడ్ బ్రేకర్లు వేశారు. స్పీడ్ బ్రేకర్లు వేయడంతో పలువురు 'సాక్షి'కి ధన్యవాదాలు తెలిపారు. ఇదిలా ఉంటే అధికారులు వేసిన స్పీడ్ బ్రేకర్లు వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు కనిపించడం లేదు. స్పీడ్ బ్రేకర్లపై వాహనదారులకు కనిపించేలా రంగు వేయాల్సి ఉంది.

'బీఆర్‌ఎస్‌కే సంపూర్ణ మద్దతు'

జన్నారం: వచ్చే ఎన్నికల్లో తెలంగాణ మాదిగ హక్కుల దండోరా బీఆర్‌ఎస్‌కే సంపూర్ణ మద్దతు తెలుపుతూ, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తుందని మాదిగ హక్కుల దండోరా నియోజకవర్గ ఇన్‌చార్జి కొండుకూరి ప్రశాంత్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం మాట్లాడుతూ.. తెలంగాణలో మాదిగ కులస్తులకు కాంగ్రెస్ ఒక్క ఎంపీ సీటు కేటాయించలేదని, బీజేపీ వర్గీకరణకు హామీ ఇచ్చి మోసం చేసిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్సీ సంక్షేమానికి కృషి చేసిందని, దళితబంధు ద్వారా దళితులకు న్యాయం చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో మాదిగ కులస్తులు బీఆర్‌ఎస్ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.

టేస్టీ చాయ్..!



- బెల్లం, రాగి టీ పై ప్రజల మక్కువ
- ఆరోగ్య ప్రయోజనాలపై దృష్టి

మంచిర్యాలఅర్బన్: చాయ్ వ్యాపారంలో మంచిర్యాల కొత్త పుంతలు తొక్కుతోంది. ఉదయాన్నే కాసింత వేడివేడి తేనీరు కడుపులో పడందే ఊపిరి సలపదు. బెడ్‌కాఫీ, బెడ్ టీ తాగటం చూస్తుంటాం. నిత్యం కిందిస్థాయి ఉద్యోగి నుంచి ఉన్నతాధికారుల వరకు టీ లేనిదే పని ముందుకు కదలని పరిస్థితి. బాడీని రీఫ్రెష్ చేసేందుకు చాయ్ తప్పనిసరిగా మారింది. ఇదివరకు బ్లాక్, గ్రీన్‌టీ, లెమన్ టీ, పూదీనా, మందార పలు రకాల టీలు మార్కెట్‌లో లభించాయి. కడక్ చాయ్.. ఇరానీ చాయ్, మసాలా చాయ్, అల్లం చాయ్ ఇలా చెప్పుకుంటే పోతే ఎన్నో.. కాలానికి అనుగుణంగా ఆరోగ్య ప్రయోజనాలున్నా (ఔషధగుణాలున్నా)చాయ్‌లపై కస్టమర్లు మక్కువ చూపుతున్నారు. ఇదివరకు ఎన్నడులేని విధంగా మంచిర్యాలలో ప్రాచీన సంప్రదాయమైన (చిరుధాన్యాలు.. బెల్లం, తాటి బెల్లం, రాగిచాయ్) రుచిని ప్రజలు ఆస్వాదిస్తున్నారు. దీనిపై వివరాలతో సండే స్పెషల్ కథనం..



బెల్లంచాయ్ తాగుతూ...

బెల్లంచాయ్ తయారు చేస్తున్న సిబ్బంది

బెల్లం చాయ్..

బెల్లం చాయ్ (హోటల్) మహారాష్ట్రలో ఎక్కువగా చేస్తుంటారు. అక్కడ నుంచి ఓ వ్యక్తి బెల్లం చాయ్‌ని పరిచయం చేశారు. పొద్దున లేస్తే సరి ఆ దుకాణాల్లో గిరాకీ ఎక్కువగా ఉంటుంది. ఓవర్‌బ్రిడ్జి, బెల్లంపల్లి చౌరస్తాలో బెల్లం చాయ్, టీ, కాఫీ అందుబాటులోకి వచ్చాయి. తాజాగా తాటి బెల్లం చాయ్, కాఫీ మార్కెట్‌కు పరిచయం చేశారు. ఇది తమిళనాడు నుంచి ఉత్పత్తులు దిగుమతి చేసుకున్నారు. ఫ్రాంచేస్ కింద చాయ్ తయారు చేసే వ్యక్తులు వచ్చి కొన్ని రోజులు ఇక్కడే ఉండి టేస్టీగా చేస్తుంటారు. బెల్లంలో షుగర్ లెవల్ తక్కువగా ఉండటం.. బెల్లం టీ తీసుకోవటంతో ఆహారం వెంటనే జీర్ణమవటం.. పొట్టలో కొవ్వు పేరుకుపోదు. బెల్లంలోని చక్కెర కంటెంట్ జీవక్రియ రేటును పెంచటం.. ఆరోగ్య ప్రయోజనాలెన్నో ఉండటంతో వీటిని ఇష్టపడుతున్నారు.

టీ లో రకాలు..

తాటిబెల్లం టీ, తాటి బెల్లం కాఫీ, తాటి బెల్లం అల్వా, బెల్లం టీ, స్పెషల్ బెల్లం టీ, బెల్లం కాఫీ, ఇలాచీ టీ, మసాలా మిల్క్, రాయలసీమ స్పెషల్ రాగి మాల్ట్, బ్లాక్ కాఫీ, లెమన్ టీ, లెమన్ మసాలా టీ, పెప్పర్ మిల్క్, జింజర్ మిల్క్ టీలు అందుబాటులోకి వచ్చాయి.

గ్రీన్ టీ..

వీటి తర్వాత ఎక్కువ మంది తీసుకునే పానీయం టీనే. గ్రీన్ టీలో హెల్త్ బెనిఫిట్స్ ఎక్కువని చెబుతున్నారు. కొల్‌స్ట్రాల్ తగ్గించి. బ్లడ్ షుగర్ తగ్గించి మొదడు చురుకుగా పనిచేస్తుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. గ్రీన్ టీని మోతాదులో మాత్రమే తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

రాగి మాల్ట్..

ఎండలు మండిపోతున్నాయి. బయటకు వెళ్లాలంటే ఒకటి, రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి. శరీరంలో చలువని పెంచేందుకు రాగి జావను తీసుకునేవారు. ఈ మధ్య కాలంలో రాగిజావా వాడకం పెరిగిపోయింది. ప్రస్తుతం రాయలసీమ స్పెషల్ రాగిమాల్ట్ అందుబాటులోకి వచ్చింది. డిమాండ్ కూడా అంతంతకు పెరిగిపోతుంది. ఓవర్‌బ్రిడ్జి సమీపంలో ఓ దుకాణంలో రాగిమాల్ట్ లభిస్తుంది.

'దేశానికి మోదీ ప్రధానిగా ఉంటేనే అభివృద్ధి'

భీమారం/రామకృష్ణాపూర్/భీమిని: ప్రధానిగా మోదీ ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని పలువురు బీజేపీ నాయకులు అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలోని అమరవాది గ్రామంలో, కన్నెపల్లి మండలంలోని 159, 160, 161బూత్ ఏరియాల్లో, భీమారం మండలంలోని మద్దికల్, ఆరెపల్లి గ్రామాల్లో శనివారం బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. కేంద్రంలో మోదీ పాలనలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థిగా గోమాసే శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో క్యాతనపల్లి పార్టీ పట్టణ అధ్యక్షుడు అశోక్, ఈశ్వరాచారీ, సత్యనారాయణ, భీమినీలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏమాజీ, మండల అధ్యక్షుడు రామయ్య యాదవ్, భీమారం మండల బీజేపీ ఇన్‌చార్జి ఆలం బాపు, మండల పార్టీ అధ్యక్షుడు బోర్లకుంట శంకర్, ప్రధానకార్యదర్శి మాడెం శ్రీనివాస్, మహిళా మోర్చా అధ్యక్షులు మేడి విజయ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



చెన్నూర్: ప్రారంభిస్తున్న అసెంబ్లీ ఇన్‌చార్జి

బీజేపీ కార్యాలయం ప్రారంభం

చెన్నూర్: పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో బీజేపీ అసెంబ్లీ కార్యాలయాన్ని బీజేపీ చెన్నూర్ అసెంబ్లీ ప్రభారి కార్యం వెంకటరమణ, బీజేపీ జిల్లా కార్యదర్శి దుర్గం అశోక్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపాక చారి, చెన్నూర్ పట్టణ ఇన్‌చార్జి పానుగంటి మధు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పట్టించుకోని గుర్తింపు సంఘం

మందమర్రిరూరల్: సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలు కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని హెచ్ఎమ్మెస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆరోపించారు. శనివారం మందమర్రిలోని హెచ్ఎమ్మెస్ కార్యాలయంలో జరిగిన ఏరియా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ఎన్నికలు జరిగి నాలుగు నెలలు గడిచినా ఇంతవరకు ఎందుకు గుర్తింపు పత్రం అందించలేదని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఈ విషయంలో యూనియన్లు కూడా ప్రశ్నించకపోవడం విడ్డూరమని అన్నారు. మందమర్రి ఏరియాలో 6వేల క్వార్టర్లు ఉండగా నాలుగు వేల మంది మాత్రమే కార్మికులు ఉన్నారని, ఇంకా రెండు వేల క్వార్టర్లు రాజకీయ పలుకుబడి ఉన్న వారు కబ్జా చేసినా యాజమాన్యం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. గెలిచిన సంఘాల నాయకులు డిప్యూటేషన్ పేరిట కార్మికుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడిగా జక్కనబోయిన శ్రీనివాస్, కేకే ఓసీ ఫిట్ కార్యదర్శిగా మౌనిక, సీఎస్పీ ఫిట్ కార్యదర్శిగా చొప్పరి రామస్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు బోనాల శ్రీనివాస్, సుదర్శన్, శ్రీనివాస్‌రెడ్డి, తిప్పారపు సారయ్య పాల్గొన్నారు.

నియామకం

మంచిర్యాలటౌన్: పట్టణానికి చెందిన చింతం శ్రీనివాస్‌ను ఐఎన్టీయూసీ మంచిర్యాల మండల అధ్యక్షుడిగా నియమిస్తూ ఐఎన్టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్ నియామక పత్రాన్ని అందించారు.

సన్మానం

జన్నారం: ఇంటర్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి మంచి మార్కులు సాధించిన ముస్లిం మైనారిటీ విద్యార్థులను మైనారిటీ పెద్దలు శనివారం సన్మానించారు. భవిష్యత్‌లో మంచి చదువులు చదివి తల్లిదండ్రులకు, మండలానికి పేరు సాధించాలని ఆకాంక్షించారు.

సభ ఏర్పాట్ల పరిశీలన

వేమనపల్లి: మండలంలోని నీల్వాయిలో ఎన్నికల భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. ఈ బహిరంగ సభకు ఎమ్మెల్యేలు వినోద్, వివేక్‌లతో పాటు పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి వంశీకృష్ణ హాజరుకానున్నారు. సభ ఏర్పాట్లను స్థానిక ఎంపీటీసీ ఆర్.సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ సాబీర్‌అలీ, మాజీ సర్పంచ్ మధులు పరిశీలించారు.

సామాజిక తనిఖీ సన్నాహక సమావేశం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం 3వ విడత సామాజిక తనిఖీ సన్నాహక సమావేశం జరిగింది. సమావేశానికి ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, సామాజిక తనిఖీ విభాగం ఎస్సార్పీ మహేశ్, ఈసీ శ్రీనివాసరెడ్డితో పాటు పంచాయతీ కార్యదర్శులు, డీఆర్‌పీలు, టీఏలు, ఎఫ్ఏలు, మేట్స్ హాజరు కాగా ఆదివారం నుంచి మండలంలో చేపట్టే ఈజీఎస్ సామాజిక తనిఖీ బృందంతో కలిసి సన్నాహక సమీక్ష జరిపారు. పంచాయతీల్లో ఈజీఎస్ ద్వారా 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేసిన దాదాపు 350 పనులకు సంబంధించి రూ.2.39 కోట్ల విలువ గల పనులను పరిశీలించి వాటిపై నివేదికలు సమర్పించాలని తీర్మానం చేశారు. సామాజిక తనిఖీ నివేదికలు పారదర్శకంగా ఉండాలని సూచించారు.



సమీక్షలో పాల్గొన్న సిబ్బంది

ఆర్‌కేపీలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

రామకృష్ణాపూర్: ఎన్నికల నేపథ్యంలో శనివారం కేంద్ర బలగాలతో పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలంతా సహకరించాలని కోరారు. ఎన్నికలు ముగిసేంత వరకు పోలీసుల నియమనిబంధనలు పాటిస్తూ శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఉచిత గొడుగుల పంపిణీ

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఐబీ చౌరస్తాలో ఉచిత పెరుగన్నం స్టాల్ వద్ద అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జిల్లా అధ్యక్షుడు చంచు రాజ్ కిరణ్ ఆధ్వర్యంలో గొడుగులను శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. చిరు వ్యాపారం చేసుకుని, పండ్లు అమ్ముకునే మహిళలు ఎండలకు తట్టుకోలేక పోతుండడంతో, వారికి గొడుగులను అందించినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే గైర్హాజరుపై గుసగుసలు

చెన్నూర్: చెన్నూర్‌లో కాంగ్రెస్ గ్రూప్ రాజకీయాలకు తెరపడింది. చెన్నూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జుల్ఫికర్ అమ్మద్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కోటపల్లి మండలానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిక కార్యక్రమాన్ని జుల్ఫికర్ స్వగృహంలో ఏర్పాటు చేశారు. ఈ చేరికల కార్యక్రమానికి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరు కావాల్సి ఉంది. రాత్రి 12 గంటల వరకు ఎమ్మెల్యే రాకపోవడంతో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జుల్ఫికర్ అమ్మద్ నేతృత్వంలో కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కోటపల్లి మండలంలోని ఆలుగామ, ఎదుల్లబంధం, సిర్సా, పుల్లగామ, బబ్బెరచెలుకల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైనట్లు జుల్ఫికర్ తెలిపారు.

ఎమ్మెల్యే రాకుండా..

మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జుల్ఫికర్ అమ్మద్ ఆధ్వర్యంలో కోటపల్లి మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరికలకు ఎమ్మెల్యేను రాకుండా కొందరు కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారని గుసగుసలు విన్పిస్తున్నాయి. చేరికలకు ఎమ్మెల్యే వస్తే జుల్ఫికర్‌కు క్రెడిట్ దక్కుతుందనే భావంతోనే చెన్నూర్‌కు చెందిన కొందరు నేతలు తెరవెనుక రాజకీయం చేశారని తెలిసింది.

ఎన్నికల వేళ చేరికలకు దూరంపై అనుమానాలు..

కొడుకును ఎంపీగా చేయాల్సిన సమయంలో వివేక్ వెంకటస్వామి చెన్నూర్‌లో ఏర్పాటు చేసిన చేరికలకు హాజరు కాకపోవడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. పార్టీ క్యాడర్‌ను కాపాడుకోవాల్సిన సమయంలో గైర్హాజరు కావడంపై ఎమ్మెల్యేను అడ్డుకున్న నేత ఎలాంటి హామీ ఇచ్చారోనని కొందరు చర్చించుకుంటున్నారు. ఏదిఏమైనా ఎన్నికల సమయంలో చేరికలకు హాజరు కాకపోవడంపై చెన్నూర్‌లోని కొందరు నాయకులు ఎమ్మెల్యే తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చెన్నూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుర్మ రాజమల్లగౌడ్, మాజీ పట్టణ అధ్యక్షులు బషీరోద్దీన్, యూత్ నాయకులు చెన్నూరి శ్రీధర్, హాజులు పాల్గొన్నారు.

6 నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

బెల్లంపల్లి: ఈ నెల ఆరో తేదీ నుంచి డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లను ప్రారంభిస్తున్నట్లు బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీఎస్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కళాశాల ఆవరణలో అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్లను శనివారం అధ్యాపకులు, సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు డిగ్రీలో ప్రవేశం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన బోధన జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దోస్త్ నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం టాక్సేషన్, బీకాం సీఏ, బీఎస్సీ ఎంపీసీ, బీజెడ్సీ తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన జరుగుతుందని తెలిపారు.

వైద్య వ్యవస్థలో మార్పుకోసం ఒక్కటైన ఆర్థో వైద్యులు



మంచిర్యాల ఆర్థో వైద్యులు

మంచిర్యాలటౌన్: వైద్య రంగంలో ఉన్నత విలువలను పెంపొందించేందుకు, ప్రజారోగ్యం మెరుగుపరిచేందుకు మంచిర్యాలకు చెందిన ఆర్థోపెడిక్ వైద్యులు మంచిర్యాల ఆర్థోపెడిక్ అసోసియేషన్(ఓఎస్ఏఎం) ద్వారా ఏకతాటిపైకి వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో శనివారం ఆర్థో వైద్యులంతా ఒక్కచోట చేరి, వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా నిర్ణయాలు తీసుకుని, ఓఎస్ఏఎం ద్వారా కార్యాచరణను రూపొందించారు. ఇందుకోసం రెఫరల్, కమీషన్ వ్యవస్థ సహకారంతో నడిచే హాస్పిటల్స్‌కు మంచిర్యాల ఆర్థోపెడిక్ అసోసియేషన్ ద్వారా ఎటువంటి సహకారం లభించదని అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాఘవరావు, డాక్టర్ కుమార్ తెలిపారు. అర్హతలు లేని వైద్యులు, వైద్యులు లేని ఆసుపత్రులు, రెఫరల్/కమీషన్ వ్యవస్థ సహకారంతో నడిచే ఆసుపత్రులపై తగు చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి(టీఎస్ఎంసి) సభ్యులు డాక్టర్ యెగ్గన శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ఉదయ్, అరవింద్, త్రినాథరావు, సంతోశ్, అశోక్, ఓం ప్రకాశ్, ప్రవీణ్, రాజు, రవి, శ్రీధర్, వసీంలు పాల్గొన్నారు.

వంశీకృష్ణను గెలిపించాలని ప్రచారం



ఈజీఎస్ కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

భీమారం/చెన్నూర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని, పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని చెన్నూర్‌లో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, భీమారం మండలం కొత్తపల్లిలో మండల కాంగ్రెస్ నాయకులు అన్నమొల్ల అశోక్ కోరారు. గడపగడపకూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్‌కు మాలమహానాడు మద్దతు

పాతమంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి జాతీయ మాల మహానాడు మద్దతునిస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మాలమహానాడు కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు వివేక్‌వెంకటస్వామి, వినోద్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలమహానాడు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 33 జిల్లాలో చేపట్టిన రాజ్యాంగ రక్షణ యాత్ర విజయవంతమైందని తెలిపారు. జిల్లాలోని మాలమహానాడు నాయకులు, మాల కుల సంఘం గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో జాతీయ మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.శంకరయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి పైడిమల్ల నర్సింలు, జిల్లా ప్రధాన కార్యదర్శి సొల్లు శ్రీనివాస్, జైభీం సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ మాసాడి పురుషోత్తం, జిల్లా అధ్యక్షుడు నరేష్ పాల్గొన్నారు.

రైల్వే గేట్ లాక్ తీసేదెప్పుడో..?!

- స్తంభించిన మంచిర్యాల రహదారి రాకపోకలు
- వారం రోజులుగా వాహనదారుల ఇబ్బందులు
- అదనంగా ఎనిమిది కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి



మూసి ఉన్న క్యాతనపల్లి రైల్వేగేట్

రామకృష్ణాపూర్: మంచిర్యాల వెళ్లే ప్రధాన రహదారి రాకపోకలు ఎప్పుడు పునరుద్ధరణకు నోచుకుంటాయని ప్రజలు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. వారంరోజులుగా క్యాతనపల్లి రైల్వేగేట్ లాక్ పడడంతో ఒక విధంగా బల్దియా మొత్తం బందీ అయినట్లు అయిపోయింది. సాంకేతిక కారణాల వల్ల రైల్వేగేటు పనులు చేపడుతున్నామని అధికారులు ప్రకటించినా.. అదనపు ప్రయాసం తప్పటం లేదు. మంచిర్యాల పట్టణం చేరుకోవటానికి ఏకంగా ఎనిమిది కిలోమీటర్ల అదనపు దూరం పయనించాల్సి వస్తుంది. ఇదే క్రమంలో సాధ్యమైనంత మేరకు మరమ్మతులు త్వరగా చేపడితే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

క్యాతనపల్లి మున్సిపాలిటీ నుంచి మంచిర్యాల వెళ్లే ప్రధాన రహదారిలో రాకపోకలు నిలిచిపోయిన సంగతి తెల్సిందే. ఏప్రిల్ 29వ తేదీ నుంచి అధికారికంగా రైల్వేగేటు మూసివేస్తున్నట్లు రైల్వేశాఖ అధికారులు ప్రకటించారు. హైదరాబాద్ టు ఢిల్లీ ప్రధాన రైల్వే మార్గంలో మూడో ట్రాక్ మరమ్మతు పనులు చేపడుతున్న దరిమిలా గేటు మూసివేయాల్సి వస్తుందని అధికారులు వెల్లడించారు. మే 5వ తేదీ వరకు ట్రాక్ మరమ్మతులు కొనసాగుతాయని ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సూచించారు. అయితే ఈ మార్గాన వెళ్లే వారికి ఇబ్బందులు మాత్రం తప్పటం లేదు. చిన్నచిన్న చిరుద్యోగులు, విద్యార్థులు నానా తంటాలు పడుతున్నారు. ముఖ్యంగా వైద్య చికిత్సల కోసం వెళ్లే వారి పరిస్థితి మరీ దయనీయంగా మారింది.

ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణంలో ముప్పతిప్పలు...

క్యాతనపల్లి వాసుల సహనానికి పరీక్షగా నిలుస్తోంది రైల్వేలైన్. దశాబ్దం క్రితం మొదలైన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. పదే పదే గేటు పడటం వల్ల ఒక్కోసారి 30 నిమిషాల వరకు నిరీక్షించాల్సిన దుస్థితి. సకాలంలో వైద్యం అందక పలువురు ప్రాణాలు కూడా కోల్పోయారు. ఈ బ్రిడ్జితోనే ఇక్కట్లు పడుతుంటే.. తాజాగా ఈ మరమ్మతు పనులు మరీ సంకటంగా మారాయని పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ముందుగా గేటు వద్ద పనులు పూర్తిచేసి మార్గం సుగమం చేస్తే సరిపోయేదని కొందరు అంటున్నారు. ఏదేమైనా రైల్వేశాఖ అధికారులు పెట్టిన గడువు నేటితో ముగియనున్న నేపథ్యంలో ఇప్పటికైనా వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆటోరిక్షా, బైక్ ఢీ

- ముగ్గురికి గాయాలు
- సభ నుంచి తిరిగివస్తుండగా ప్రమాదం

భీమారం: జిల్లా కేంద్రంలో జరిగిన కేసీఆర్ సభకు ఆటోరిక్షాలో వెళ్లి, తిరిగి భీమారం వస్తుండగా శనివారం రాత్రి భీమారం మండలం కుందారం ఎక్స్ రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్ కు ఢీకొట్టడంతో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. భీమారంకు చెందిన ఐదుగురు ఆటోలో మంచిర్యాల పట్టణంలో రాత్రి జరిగిన మాజీ సీఎం కేసీఆర్ సంభకు వెళ్లారు. సభ ముగిసిన వెంటనే తిరిగి వస్తుండగా కుందారం వద్ద ఆటోను భీమారం నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న బైక్ అదుపు తప్పి ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురిలో పెన్కుల రాజు, బూకల రాజన్నతో పాటు బైక్ నడిపిస్తున్న ప్రైవేట్ ఆర్టీసీ డ్రైవర్ అమరగాని రాజ్‌కుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108కు సమాచారం అందించి క్షతగాత్రులను మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు భీమారం పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో, బైక్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.